పవర్‌లిఫ్టింగ్‌లో కార్మికురాలి ప్రతిభ

కోల్‌ఇండియా పోటీల్లో సాయిలతకు రజతం

గోదావరిఖని, జూన్ 13: నాగపూర్‌లో ఇటీవల జరిగిన కోల్‌ఇండియా మహిళల పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సాయిలత రజత పతకంతో మెరిసింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆర్జీ-1 ఏరియా దవాఖానలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న సాయిలత 84కిలోల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ గురువారం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పురుషులతో సమానంగా మహిళలు జాతీయస్థాయిలో రాణించడం సింగరేణికి గర్వకారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాంమ్మోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, స్పోర్ట్స్ కార్యదర్శి సారంగపాణి, సూపర్‌వైజర్ రమేశ్, గాండ్ల రాజయ్య పాల్గొన్నారు.

రగ్బీలో ఎంజేపీ విద్యార్థులకు స్వర్ణం

జాతీయ స్థాయి పోటీలకు నలుగురు ఎంపిక

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర స్థాయి రగ్బీ ఆటల పోటీల్లో మహాత్మా జ్యోతిబా పూలే(ఎంజేపీ) గురుకుల విద్యార్థులు స్వర్ణ పతకంతో మెరిశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి ఐదో జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా, ఎంజేపీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకం కైవసం చేసుకున్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు శ్రీకాంత్, చందు, ఆకాశ్, మధు, శివ, లింగస్వామి, హరికృష్ణ, విష్ణు, జైవిందర్‌ను ఎంజేపీ సొసైటీ సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి అభినందించారు. ఈ జుట్టు నుంచి నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావటంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు.

క్వార్టర్స్‌కు సుమిత్-సిక్కి జోడీ

సిడ్నీ: భారత మిక్స్‌డ్ ద్వయం సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు చేరారు. మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్ పోరులో ఈ భారత జోడీ 21-11, 21-11తో కై చెన్-కై కి బెర్నిస్ (ఆస్ట్రేలియా)పై అలవోకగా గెలిచి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. టాప్ సీడ్ చైనా షట్లర్లు జెంగ్ బంగ్ జియాంగ్-య జిన్ వీ తో క్వార్టర్స్‌లో ఈ జోడీ తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 21-17, 21-15తో మిషా జిల్బెర్మన్ (ఇజ్రాయెల్)ను ఓడించగా మరో పోరులో సమీర్ వర్మ 21-14, 14-21, 21-19తో ఎనిమిదో సీడ్ షట్లర్ లొ కీన్ యీ (సింగపూర్)కు షాకిచ్చి క్వార్టర్స్ చేరాడు. కిరణ్ జార్జి 20-22, 6-21తో కెంటా నిషిమొటో (జపాన్) చేతిలో చిత్తుగా ఓడాడు. ఆకర్షి కశ్యప్ 21-16, 21-13తో కై కి బెర్నిస్‌ను ఓడించి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది.

చరిత్ర సృష్టించిన శృతి వోరా

త్రీ స్టార్ గ్రాండ్‌ప్రి విజేత

ఢిల్లీ: భారత ఈక్వెస్ట్రియన్ (గుర్రపు స్వారీ) చరిత్రలో మరో సంచలనం. స్లోవేనియాలోని లిపికా వేదికగా ఈ నెల 7 నుంచి 9 వరకూ జరిగిన త్రీ స్టార్ గ్రాండ్‌ప్రి ఈవెంట్‌లో భారత ఈక్వెస్ట్రియన్ శృతి వోరా చాంపియన్‌గా నిలిచింది. మాగ్నునిమస్ (గుర్రం పేరు)తో కలిసి సీడీఐ-3 విభాగంలో శృతి 67.761 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రీడలో త్రీ స్టార్ గ్రాండ్‌ప్రి గెలిచిన తొలి ఈక్వెస్ట్రియన్‌గా శృతి రికార్డులకెక్కింది.

ఐపీఎల్ అక్రమ ప్రసారదారుపై

ఈడీ దాడులు

ముంబై: నిబంధనలకు విరుద్ధంగా ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేసిన సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులకు దిగింది. హక్కులు దక్కించుకున్న సంస్థ కాకుండా ఐపీఎల్ మ్యాచ్‌లను 'ఫెయిర్‌ప్లే' యాప్ ద్వారా ప్రసారం చేయడంతో పాటు బెట్టింగ్‌కు పాల్పడిన వాటిపై ఈడీ తాజాగా చర్యలకు దిగింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్(పీఎమ్ఎల్ఏ) యాక్ట్ కింద గురువారం ముంబై, పుణెలో 19 చోట్ల ఒకేసారి జరిగిన ఈ దాడుల్లో దాదాపు ఎనిమిది కోట్ల విలువైన నగదు, ఖరీదైన వాచ్‌లు, డీమ్యాట్ అకౌంట్ పత్రాలను జప్తు చేసింది. విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐపీఎల్ మ్యాచ్‌లను అనధికారికంగా ప్రచారం చేయడానికి ఫెయిర్‌ప్లే దుబాయ్, కురకావోలోని షెల్ కంపెనీల ద్వారా భారత్‌లో అక్రమంగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఇందుకోసం ఏకంగా 400కు పైగా బ్యాంక్ అకౌంట్లను ఫెయిర్‌ప్లే వినియోగించినట్లు దర్యాప్తులో బయటపడింది. ఐపీఎల్ అధికారిక ప్రసారుదారైన వయాకామ్..ముంబైలో చేసిన ఫిర్యాదుతో ఈడీ రంగంలోకి దిగడంతో ఈ బండారం బయటపడింది.

సూపర్-8 రేసు..

బంగ్లా పోటీలోనే..

అర్ధ సెంచరీతో ఆదుకున్న షకిబ్ • ఛేదనలో విఫలమైన నెదర్లాండ్స్

టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. గెలిస్తే గానీ ముందంజ వేయలేని పరిస్థితుల్లో కీలకమైన నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో జూలు విదిల్చింది. తొలుత షకిబ్ అల్‌హసన్ అర్ధసెంచరీతో అదరగొట్టడంతో బంగ్లాకు పోరాడే స్కోరు దక్కింది. లక్ష్యఛేదనలో బంగ్లా బౌలర్ల ధాటికి నెదర్లాండ్స్ కుదేలైంది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన డచ్ టీమ్ చేజేతులా ఓటమి కొనితెచ్చుకుంది.

కింగ్స్‌టౌన్ (సెయింట్ విన్సెంట్): సూపర్-8 దశకు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమిష్టి ప్రదర్శనతో రాణించింది. గురువారం కింగ్స్‌టౌన్ వేదికగా నెదర్లాండ్స్‌పై ఆ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచింది. సీనియర్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్, 9 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. స్వల్ప లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమి వైపున నిలిచారు. 20 ఓవర్లలో ఆ జట్టు 134/8 కే పరిమితమైంది. సిబ్రండ్ ఎంగెల్‌బ్రెచ్ట్ (22 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. షకిబ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆదుకున్న షకిబ్:

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ఒడిదొడుకుల మధ్యే సాగింది. రెండో ఓవర్లోనే ఓపెనర్ శాంటో (1) వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. 4వ ఓవర్లో ప్రమాదకర లిటన్ దాస్ (1) ఔట్ కావడంతో కష్టాల్లో చిక్కుకుంది. కానీ తాంజీద్ హసన్ (35)తో కలిసి సీనియర్ ఆల్‌రౌండర్ షకిబ్ బంగ్లాను ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 48 రన్స్ జోడించారు. తాంజీద్ స్థానంలో వచ్చిన తౌవిద్ హృదయ్ (9) విఫలమయ్యాడు. 38 బంతుల్లో అర్ధ సెంచరీతో పూర్తిచేసిన షకిబ్.. ఆఖర్లో మహ్మదుల్లా (25), జేకర్ అలీ (14 నాటౌట్) అండతో బంగ్లాకు పోరాడగలిగే స్కోరును అందించాడు.

తడబడ్డ నెదర్లాండ్స్:

భారీ ఛేదనేమీ కాకపోయినా నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ సైతం నెమ్మదిగానే సాగింది. 2 ఫోర్లు, ఓ సిక్సర్ సాయంతో 18 పరుగులు చేసిన లెవిట్‌ను 5వ ఓవర్లో టస్కిన్ అహ్మద్ పెవిలియన్‌కు పంపాడు. 3 ఫోర్లు కొట్టి జోరు మీదున్న మ్యాక్స్ ఓడౌడ్ (12).. తాంజిమ్ షకిబ్ 6వ ఓవర్లో అతడికే రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. ధాటిగా ఆడిన విక్రమ్‌జిత్ (26) కూడా మహ్మదుల్లా 9వ ఓవర్లో ముందు కొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. రిషద్ హోసెన్ 15వ ఓవర్లో.. క్రీజులో కుదురుకున్న సిబ్రండ్‌తో పాటు బస్ డి లిడెను ఔట్ చేసి డచ్ జట్టుకు డబుల్ షాకులిచ్చాడు. ఆఖరి 4 ఓవర్లలో నెదర్లాండ్స్ విజయానికి 44 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు లోయర్ ఆర్డర్ కూడా చేతులెత్తేయడంతో గెలిచే మ్యాచ్‌ను చేజార్చుకుంది.

సంక్షిప్త స్కోర్లు:

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 159/5 (షకిబ్ 64 నాటౌట్, తాంజీద్ 35, మికెరెన్ 2/15, ఆర్యన్ 2/17). **నెదర్లాండ్స్:** 20 ఓవర్లలో 134/8 (సిబ్రండ్ 33, విక్రమ్‌జిత్ 33, రిషద్ 3/33, టస్కిన్ 2/30)

షకిబ్ (64*)

ప్రపంచ జూనియర్ చెస్ విజేత దివ్య

గాంధీనగర్: ప్రపంచ జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన దివ్య దేశ్‌ముఖ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఆఖరి రౌండ్ పోరులో 18 ఏండ్ల దివ్య..బల్గేరియాకు చెందిన బెలోస్లవా క్రస్టెవా(బల్గేరియా)పై అద్భుత విజయం సాధించింది. దీంతో టోర్నీలో మొత్తం 11 పాయింట్లకు గాను ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య 10 పాయింట్లు దక్కించుకుని చాంపియన్‌షిప్ దక్కించుకుంది. మరియమ్ మిక్చియాన్(అర్మేనియా, 9.5), అయాన్ అల్లావెర్దియెవా (అజర్‌బైజాన్,8.5) వరుసగా రెండు, మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఓపెన్ విభాగంలో నోగర్‌బెక్ కజిబెక్ (కజకిస్థాన్) విజేతగా నిలిచాడు.

విండీస్ హ్యాట్రిక్

న్యూజిలాండ్‌కు వరుసగా రెండో ఓటమి

తరౌబా (ట్రినిడాడ్): టీ20 వరల్డ్‌కప్‌నకు ఆతిథ్యమిస్తున్న వెస్టిండీస్ వరుస విజయాలతో సూపర్-8 దశకు చేరుకుంది. ట్రినిడాడ్ లోని బ్రియాన్ లారా స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కివీస్‌ను 13 పరుగుల తేడాతో విండీస్ ఓడించింది. ట్రెంట్ బౌల్ట్ (3/16), సౌథీ (2/21) కట్టడి చేయడంతో కరేబియన్ టాపార్డర్ విఫలమైనా ఏడో స్థానంలో వచ్చిన షెర్ఫెన్ రూథర్‌ఫర్డ్ (39 బంతుల్లో 68, 2 ఫోర్లు, 6 సిక్సర్లు) వీరవిహారం చేయడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 149/9 పరుగులు చేసింది. అనంతరం కివీస్.. నిర్ణీత ఓవర్లలో 136/9 వద్దే ఆగిపోయింది. అల్జారీ జోసెఫ్(4/19), గుడకేశ్ మోటీ (3/25) రాణించారు. వరుసగా రెండు ఓటములతో కివీస్.. పొట్టి ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజ్ నుంచే 'ఎలిమినేట్' అయ్యే ప్రమాదంలో పడింది.

నసావు 'ఖేల్' ఖతం

స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధం

న్యూయార్క్: బ్యాటర్లకు అనుకూలంగా ఉండే పొట్టి ఫార్మాట్‌లో చాలాకాలం తర్వాత బౌలర్లు ఆధిపత్యం చెలాయించేలా అవకాశం కల్పించిన క్రికెట్ స్టేడియం ఇక చరిత్రలో భాగం కానుంది. టీ20 వరల్డ్‌కప్ కోసం సుమారు రూ. 250 కోట్లతో తాత్కాలికంగా న్యూయార్క్‌లోని ఈస్ట్ మిడో ఏరియాలో 930 ఎకరాల్లో ఉన్న ఐసెన్‌హోవర్ పార్క్‌లో 106 రోజులలోనే నిర్మించిన నసావు క్రికెట్ స్టేడియం కూల్చివేతకు రంగం సిద్ధమైంది. పొట్టి ప్రపంచకప్‌లో 8 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన నసావు.. బౌలర్లకు స్వర్గధామంగా నిలిచింది. అడిలైడ్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 10 డ్రాప్ ఇన్ పిచ్‌లతో ఇక్కడ బ్యాటర్లు పరుగుల కోసం తంటాలుపడ్డారు. జూన్ 12న అమెరికాతో భారత్ మ్యాచ్ ముగిసిన తర్వాత నిర్వాహకులు స్టేడియంలో స్టాండ్స్‌ను కూల్చివేసి ఇక్కడి సామాగ్రిని తరలించే పని మొదలుపెట్టారు. గురువారం స్టేడియం సమీపంలో భారీ బుల్డోజర్లు, క్రేన్లు దర్శనమిచ్చిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. లాస్ వెగాస్ నుంచి అరువు తీసుకొచ్చిన సామాగ్రి (కుర్చీలు, స్టాండ్స్, విడి భాగాలు) అక్కడ నిర్వహించే గోల్ఫ్ ఈవెంట్‌కు తిరిగి ఇవ్వనున్నట్టు న్యూయార్క్ టైమ్స్ ఓ కథనంలో పేర్కొంది. 34 వేల సామర్థ్యంతో నిర్మించిన ఈ స్టేడియంలో ప్రతిష్టాత్మక భారత్-పాక్ మ్యాచ్‌తో పాటు మిగిలిన మ్యాచ్‌లన్నీ అభిమానులను అలరించాయి. ఇప్పటి దాకా భారత్ ఆడిన మ్యాచ్‌లు అన్నీ ఇక్కడే జరిగాయి. వంద పరుగులు ఛేదించడానికి జట్లు నానా తంటాలు పడిన ఈ పిచ్‌పై కెనడా సాధించిన 137 పరుగులే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. నసావు స్టేడియాన్ని కూల్చివేస్తుండటంపై సోషల్ మీడియాలో నెటిజన్లు స్పందిస్తూ.. 'బౌలర్ల అడ్డాగా నువ్వెప్పటికీ గుర్తుంటావు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

చిత్రం

సెప్టెంబర్‌లో 'దేవర'

ఎన్టీఆర్ 'దేవర' చిత్రం ముందస్తుగా ప్రకటించినట్లు అక్టోబర్ 10వ తేదీన కాకుండా రెండు వారాల ముందుగా సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కొరటాల శివ దర్శకత్వంలో అత్యుత్తమ సాంకేతిక హంగులతో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో సైఫ్‌అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. రెండు భాగాలుగా ఈ సినిమాను రూపొందిస్తుండగా.. తొలిభాగం సెప్టెంబర్ 27న విడుదలకానుంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని, ఎన్టీఆర్ మునుపెన్నడూ చూడని శక్తివంతమైన పాత్రలో కనిపిస్తారని చిత్ర బృందం పేర్కొంది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్.రత్నవేలు, ప్రొడక్షన్ డిజైనర్: సాబుసిరిల్, నిర్మాతలు: మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె, దర్శకత్వం: కొరటాల శివ.

జీవితానికి తోడు అవసరమా?

దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక మమతామోహన్‌దాస్. ఆమె మంచి గాయని కూడా కావడం విశేషం. కొన్నాళ్ల క్రితం ఆనారోగ్యం కారణంగా సినిమాలకు దూరమైన మమతా.. మళ్లీ తన మాతృభాష మలయాళంలో బిజీ అయ్యింది. తమిళంలో విజయ్‌సేతుపతితో కలిసి ఆమె నటించిన చిత్రం 'మహారాజా'గా తెలుగులో విడుదల కానుంది. ఇలా వరుసగా అవకాశాలు అందుకుంటూ, పూర్వవైభవాన్ని దక్కించుకుంటున్నది మమతామోహన్‌దాస్. ఇదిలావుంటే.. 39ఏళ్ల ఈ అందాల భామ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి, డేటింగ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'లాస్ ఏంజెల్స్ ఉన్నప్పుడు ఒకరిని ఇష్టపడ్డాను. కానీ ఆ బంధం ఎక్కువకాలం కొనసాగలేదు. ఒత్తిడితో కూడిన బంధాలు నిలవవు. బంధం బలంగా ఉండాలి. ఇప్పుడైతే మానసికంగా ధృఢంగా ఉన్నాను. నాకైతే జీవితానికి కచ్చితంగా తోడు అవసరమని నేను అనుకోవడంలేదు. నా మైండ్‌సెట్‌కి దగ్గరగా ఉండే వ్యక్తి దొరికితే అప్పుడు పెళ్లి గురించి ఆలోచిస్తా. ఒకవేళ అదే జరిగితే.. అందరికీ చెప్పే చేసుకుంటా' అని చెప్పింది మమతా మోహన్‌దాస్.

అర్జునుడిగా కనిపిస్తాడా?

'కల్కి 2898' సినిమాలో అర్జునుడిగా విజయ్ దేవరకొండ కనిపించబోతున్నాడా? వాతావరణం అవుననే చెబుతున్నది. 'కల్కి' పురాణాలతో మిళితమైన ఫిక్షన్ సినిమా. ఆరువేల సంవత్సరాల క్రితం జరిగిన కురుక్షేత్ర సంగ్రామానికి అశ్వత్థామ వృత్తాంతానికి ఈ కథకు సంబంధం ఉందని ఇప్పటి వరకూ విడుదలైన ప్రచార చిత్రాలే చెబుతున్నాయి. వృద్ధుడైన ద్రోణసుతుడు అశ్వత్థామను చూసిస్తూనే, యువకుడైన అశ్వత్థామను కూడా టీజర్‌లో చూపించారు దర్శకుడు. కాబట్టి కచ్చితంగా ఆరు వేల సంవత్సరాల క్రితం ఏం జరిగిందో ఇందులో చూపించే అవకాశం ఉంది. అశ్వత్థామ వృత్తాంతంలో కృష్ణార్జునుల పాత్రలు చాలా కీలకం కాబట్టి అర్జునుడి పాత్రను విజయ్ దేవరకొండతో చేయించడం జరిగిందనేది ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్న మాట. మరి 'కల్కి'గా కనిపించనున్న ప్రభాసే.. కృష్ణుడిగా కూడా కనిపిస్తారా? అనేది తెలియాల్సివుంది.

బాలీవుడ్ నిర్మాణ సంస్థతో భారీ డీల్!

దేశవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న హీరోల్లో ప్రభాస్ ఒకరు. 'బాహుబలి ఫ్రాంచైజీ', సలార్ సినిమాల తర్వాత ఆయన ఇమేజ్ ఆకాశమంత ఎత్తుకు చేరుకుంది. ఈ నెల 27న 'కల్కి 2898'గా రాబోతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆ సినిమా కోసం దేశం మొత్తం ఎదురుచూస్తున్నది. అంతేకాదు, ఈ సినిమా తర్వాత కూడా ఆయనకు చాలా కమిట్‌మెంట్లున్నాయి. అయినా సరే.. 'టీ సిరీస్' యాజమాన్యం ఆయనకు భారీ మొత్తంలో అడ్వాన్స్ ఇచ్చేశారట. ఫిల్మ్ వర్గాల్లో ప్రస్తుతం ఈ విషయంపైనే చర్చ నడుస్తున్నది. 'టీ సిరీస్' గతంలో ప్రభాస్‌తో 'ఆదిపురుష్' తీశారు. ఆ సినిమా దారుణమైన ఫ్లాప్‌ని మూటగట్టుకున్నా, ముందుగానే బిజినెస్ డీల్స్ క్లోజ్ చేసుకోవడంవల్ల 'టీ సిరీస్' వాళ్లు మాత్రం లాభాలతోనే బయటపడ్డారు. అందుకే, ఈ సారి ప్రభాస్‌తో సరైన సినిమా చేయాలనే కసితో ఉన్నారట టీ సిరీస్ యాజమాన్యం. ప్రభాస్ కోసం 'వార్' దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ ఓ కథ కూడా రెడీ చేశారు. ప్రభాస్ ఓకే అంటే, షూట్‌కి వెళ్లిపోడానికి రెడీగా ఉన్నారట టీ సిరీస్. కానీ ప్రభాస్‌కు ఓకే అనే పరిస్థితి లేదు. ఆయన 'కల్కి 2898' విడుదలకు సిద్ధమైంది. మారుతీ దర్శకత్వంలో ప్రభాస్ చేస్తున్న 'రాజాసాబ్' సినిమా కూడా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మరోవైపు 'సలార్-శౌర్యాంగపర్వం' షూటింగ్ మొదలైంది. ఇంకోవైపు అను రాఘవపూడి చెప్పిన పీరియాడిక్ కథకు కూడా ప్రభాస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఇవన్నీ పూర్తవ్వాలంటే రెండేళ్లు పట్టడం ఖాయం. దీన్ని బట్టి చూస్తే టీ సిరీస్ వాళ్లు ఓ రెండేళ్ల ఆగక తప్పదు.

అందరికీ నచ్చేలా హనీమూన్ ఎక్స్‌ప్రెస్

'అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న పాత్ర చేయాలనే నా కోరిక 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' సినిమా ద్వారా తీరింది. ప్రేమికులు, పెళ్లాడబోయే వాళ్లు, పెళ్లాడిన కొత్తజంటలు, ఇరవైఏళ్లుగా కలిసి బతుకుతున్న దంపతులు.. ఇలా ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది. ఆద్యంతం వినోదభరితంగా దర్శకుడు బాలరాజశేఖరుని ఈ చిత్రాన్ని రూపొందించారు' అన్నారు హీరో చైతన్యరావు. ఆయన కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. హెబ్బాపటేల్ కథానాయిక. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చైతన్యరావ్ మాట్లాడారు. ' 30 వెడ్స్ 21' చైతన్యరావ్, 'కుమారి 21ఎఫ్' హెబ్బాపటేల్.. డిఫరెంట్ ఇమేజ్‌లు ఉన్న వీరిద్దరూ జంటగా నటించడమే ఈ సినిమా ప్రత్యేకత. కంటెంటే ఈ సినిమా ప్రధాన బలం. చక్కని రొమాంటిక్ కామెడీ మూవీ ఇది. దానికి తగ్గట్టే కల్యాణీ మాలిక్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకాదరణ పొందుతుంది' అని దర్శకుడు నమ్మకం వెలిబుచ్చారు. నా నటజీవితంలో ఆసక్తికరమైన ప్రయాణం ఈ సినిమా అని హెబ్బాపటేల్ చెప్పారు. ఇంకా చిత్ర బృందం మొత్తం మాట్లాడారు.

తెరపై ఓ జీవితాన్ని చూస్తారు

అజయ్‌ఘోష్, చాందిని చౌదరి జంటగా నటించిన చిత్రం 'మ్యూజిక్‌షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకుడు. ఫ్లైహై సినిమాస్ పతాకంపై హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత ధీరజ్ మొగిలినేని ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిరాజేష్ మాట్లాడుతూ.. ట్రైలర్ చూస్తే దర్శకుడు ఎంతో మనసుపెట్టి ఇష్టంతో ఈ సినిమాను తీశాడని అర్థమవుతున్నదని, అజయ్ ఘోష్ తన పాత్రలో జీవించారని అన్నారు. అజయ్‌ఘోష్ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆలోచింపజేస్తుంది, ఆనందింపజేస్తుంది. హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది' అన్నారు. హిందీలో వచ్చిన 12th ఫెయిల్, లాపతా లేడీస్ తరహాలోనే 'మ్యూజిక్ షాప్‌మూర్తి' ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిచ్చే చిత్రమవుతుందని, తెరపై ఓ జీవితాన్ని చూసిన అనుభూతినందిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.